క్లుప్తంగా

జేసీబీ, టిప్పర్ల సీజ్

శాయంపేట : నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్న జేసీబీతోపాటు 5 టిప్పర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని తహరాపూర్ పోచమ్మకుంట చెరువు మట్టిని పంట పొలాల్లో పోసుకునేందుకు అదే గ్రామానికి చెందిన గొట్టిముక్కుల విష్ణువర్ధన్‌రెడ్డి నీటిపారుదలశాఖ అధికారుల నుంచి అనుమతి తీసుకున్నాడు. అధికారులు జేసీబీ, ట్రాక్టర్లతో మట్టి తరలింపునకు అనుమతి ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా హిటాచి తో అనుమతికి మించి టిప్పర్లతో మట్టి తరలించాడు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.గిరిధర్‌కు గ్రామస్తులు సమాచారం అందించారు. దీంతో విష్ణువర్ధన్ రెడ్డితో పాటు టిప్పర్ డ్రైవర్లపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డీఈఈ గిరిధర్ తెలిపారు. దీంతో డీఈఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హిటాచి మిషన్, ఐదు టిప్పర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

పిడుగు పాటుకు మూగజీవాల బలి



ధర్మసాగర్ : పిడుగుపాటుకు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండలంలోని దేవనూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దేవునూర్ గ్రామానికి చెందిన అవేలి శంకర్ రావుకు చెందిన గేదె, తెలంగాణపల్లెకు చెందిన మొట్ల నర్సయ్యకు చెందిన ఎద్దును ఆదివారం ఉదయం దేవునూర్ శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద చెట్లకు కట్టేశారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఈదురు గాలులు వీస్తూ పిడుగు పడింది. దీంతో గేదె, ఎద్దు అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధితులు తెలిపారు. మృతి చెందిన గేదె విలువ రూ.70 వేలు, ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

యాదలక్ష్మికి నివాళి

పరకాల : బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ తల్లి యాదలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె చిత్రపటానికి కేంద్ర సహాయ మాజీ మంత్రి పొన్ రాధాకృష్ణ, వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ ఆదివారం నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, రాష్ట్ర కౌన్సిలింగ్ మెంబర్ రాజవీర్, కౌన్సిలర్స్ భద్రయ్య, పూర్ణాచారి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



లింగయ్య(ఫైల్)

ఐనవోలు : పురుగుల మందు తాగి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని గర్మిళ్లపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. జఫర్‌ఘడ్ ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం.. గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన బాలబోయిన లింగయ్య (48) కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. కడుపు నొప్పి విపరీతంగా వస్తుండగా భరించలేక ఆదివారం మధ్యాహ్నం తన పొలం వద్ద ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు లింగయ్యను ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు అజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

చికిత్స పొందుతూ మరొకరు..



రామస్వామి(ఫైల్)

ఆర్థిక ఇబ్బందులకు తోడు అనారోగ్య సమస్య వెంటాడడంతో ఆ వ్యక్తి ఎలుకల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ సంఘటన పున్నేలు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పున్నేలు గ్రామానికి చెందిన సుదనబోయిన రామస్వామి (58) కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అతను కూలీ పనులకు వెళ్లి తన ఇద్దరు కమారులను బాగా చదివిస్తున్నారు. పెద్ద కుమారుడు బీటెక్ పూర్తయి గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతుండగా.. చిన్న కుమారుడు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అదే విధంగా ఇద్దరు కూతుర్లకు వివాహం చేశాడు. ఈ క్రమంలో అప్పులు అయ్యాయి. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీనికి తోడు ఇటీవల ప్రమాదవశాత్తు కిందపడగా చేయి విరిగింది. దీంతో పనులకు వెళ్లకుండా ఇంట్లో ఉంటూ తీవ్ర మనస్థాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఎలుకలమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రామస్వామిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. రామస్వామి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గైకడి అనిల్ కుమార్ తెలిపారు.

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు

- పశువుల పాకగా చేపల మార్కెట్ షెడ్
- రోడ్డుపైనే విక్రయాలు
- ముక్కు మూసుకుంటున్న స్థానికులు
- ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారుల ఇబ్బందులు



పన్నెండేళ్లుగా నిరుపయోగంగా ఉంటున్న చేపల మార్కెట్ షెడ్

కమలాపూర్ : ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రంలో లక్షలు వెచ్చించి నిర్మించిన చేపల మార్కెట్ పశువులపాకగా మారింది. సుమారు పన్నెండేళ్ల క్రితం రూ.5 లక్షల ఆర్‌కేవీవై నిధులతో స్థానిక ఊరచెరువు శిఖం భూమిలో చేపల మార్కెట్ నిర్వహణ కోసం ఒక షెడ్ నిర్మించారు. షెడ్ నిర్మాణం పూర్తి అయ్యి పన్నెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అలంకారప్రాయంగానే మిగిలి పోయింది. దీంతో కొందరు స్థానికులు పశువుల కొట్టంలా వినియోగిస్తూ తమ పశువులు, మేకలు, గొర్రెలను కట్టేసుకుంటున్నారు. చేపల మార్కెట్‌లో అన్ని రకాల వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకొస్తే మండల ప్రజలకు అన్ని వేళలా తాజా చేపలు అందుబాటులో ఉండటమే కాకుండా మరికొన్ని మత్స్య కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చేపల మార్కెట్ షెడ్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపైనే చేపల అమ్మకం..

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని గుడిబండ వద్ద ప్రతిరోజు ఉదయం, సాయంత్రం కూరగాయల మార్కెట్ వద్ద రోడ్డుపైనే మత్స్య కార్మికులు నిత్యం చేపలు విక్రయిస్తున్నారు. మత్స్య కార్మిక కుటుంబాలకు చెందిన మహిళలు చేపలను విక్రయిస్తున్న ప్రాంతాల్లోనే రోడ్డు వెంట వాటిని కోసి శుభ్రం చేస్తున్నారు. దీంతో ఆ పరిసర ప్రాంతాల్లో భరించలేని దుర్గంధం వ్యాపిస్తుండటంతో స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.



రోడ్డుపైనే చేపలు శుభ్రం చేస్తున్న మహిళలు



రహదారిపై నిలిపిన వాహనాలు

వాహనదారులకు ఇబ్బందులు..

స్థానిక గుడిబండ వద్ద రోడ్డుపక్కనే చేపల విక్రయాలు సాగిస్తుండటంతో ఆ సమీపంలోని గొల్లవాడకు వెళ్లే వాహనదారులు, ఇతరులకు ఇబ్బందులు తప్పడం లేదు. సాయంత్రం వేళ చేపల కొనుగోలుదారులతో ఆ రోడ్డు కిక్కిరిసిపోతోంది. చేపలు, కూరగాయల కొనుగోళ్ల కోసం వచ్చిన వినియోగదారులు తమ వాహనాలను గొల్లవాడకు వెళ్లే రహదారికి అడ్డంగా రోడ్డుపైనే నిలుపుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

హామీలను వందశాతం నెరవేరుస్తాం

- కాంగ్రెస్ దమ్మును చూసి కేసీఆర్, కేటీఆర్‌కు వణుకు
- దేవుడి పేరుతో ఓట్లు అడగడం బీజేపీ మానుకోవాలి
- రోడ్‌షోలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



కమలాపూర్ : మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్

ఎల్కతుర్తి/ కమలాపూర్ : 'మేం అధికారంలోకి వచ్చిన నిమిషం నుంచే ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నాం. ఇప్పటికే రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం హామీలను అమలు చేశాం' అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఆ పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి ఆదివారం ఎల్కతుర్తి, కమలాపూర్, మండలాల్లో కార్నర్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. హుస్నాబాద్ ప్రాంతానికి దేవాదుల, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీళ్లు తీసుకొచ్చి పంటపొలాలను పచ్చని మాగానిగా మారుస్తానని హామీ ఇచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తుంటే కళ్లు ఓర్వలేని కేసీఆర్, కేటీఆర్ మహిళలను చులకన చేసి అవమాన పరుస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు, ఇళ్లు లేని నిరుపేదల కోసం మొదటి దశలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు, కొత్త పింఛన్లతో పాటు పాత పింఛన్లను రూ.4 వేలకు పెంచి ఇస్తామని, ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లు అప్పు చేసి, రూ.40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టి ఖజానాలో ఒక్క రూపాయి లేకుండా చేసిందని ఆరోపించారు. బండి సంజయ్, వినోద్‌కుమార్ ఇద్దరు ఎంపీగా ఉన్న ఐదేళ్లలో ఏం చేశారో చెప్పాలని, అసలు వారు కమలాపూర్‌కు ఎప్పుడైనా వచ్చారని అని ప్రశ్నించారు. 'అక్షింతలు అంటున్నారు, దేవుడి ఫొటో పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారు, దేవుడు గుళ్లో ఉండాలి, భక్తి గుండెల్లో ఉండాలి. చేసిన అభివృద్ధిని చూపి ఓట్లు అడగాలి. భార్య మంగళసూత్రాలు అమ్ముకున్న అని మొసలి కనీళ్లు పెట్టినోళ్లకు ఇప్పుడు వందల కోట్లు ఎలా వచ్చాయి' అని ప్రశ్నించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు కమలాపూర్‌కు గ్యాస్ ప్లాంట్, మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాల, జమ్మికుంటకు రైల్వే స్టేషన్, తిరుపతికి వెళ్లేందుకు రైలు సదుపాయం తెచ్చానన్నారు. మాకు తోడుగా రాజేందర్‌రావు ఎంపీగా ఉంటే కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు.

నూతన బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం

నడికూడ : మండలంలోని కంఠాత్మకూరు వాగుపై ఉన్న లోలెవల్ వంతెన కూల్చివేత పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. 1991లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పురపాలకశాఖ మంత్రి మాదాడి నర్సింహారెడ్డి ఈ బ్రిడ్జిని నిర్మించారు. అయితే బ్రిడ్జి శిథిలావస్థలకు చేరుకోగా పలుమార్లు అధికారులకు వినతులు వెళ్లాయి. ఎట్టకేలకు రూ. రూ.10 కోట్ల వ్యయంతో ఫోర్‌లైన్ హైలెవల్ నూతన బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం ఓకే చెప్పింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జి కూల్చివేత పనులు ప్రారంభించారు.



కొనసాగుతున్న బ్రిడ్జి కూల్చివేత పనులు

వృద్ధాశ్రమంలో అన్నదానం

వరంగల్: హనుమకొండలోని సహృదయ వృద్ధాశ్రమంలో వరంగల్ వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు తమ హెల్పింగ్ హ్యాండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు క్లబ్ కన్వీనర్ డాక్టర్ హేమశరత్ తెలిపారు. కళాశాల ఏడవ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఈమేరకు వారిని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బలరాం, తదితరులు అభినందించారు.

నిరంతర అభ్యాసంతో దివ్యాంగుల్లో మానసిక వికాసం

హన్మకొండ కల్చరల్: నిరంతర అభ్యాసంతో మానసిక దివ్యాంగుల్లో మానసిక వికాసం పెంపొందించవచ్చని భద్రకాళి దేవాలయ ఈఓ శేషుభారతి అన్నారు. ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రకాళి దేవాలయం ప్రాంగణంలో హనుమకొండ మల్లికాంబ మనోవికాస కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శేషుభారతి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం భక్తులకు మల్లికాంబ సిబ్బంది అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకురాలు బండా రామలీల, కోడం కల్యాణ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, గురువులు

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999 సంవత్సరంలో పదోతగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు కుమారస్వామి, మయూరి దేవి, మనోహర్, ఐలయ్యను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు న్యాతాని హేమంత్, భూపాలపల్లి ఆర్‌ఐ కిరణ్, ఆత్మకూరు పంచాయతీ కార్యదర్శి మేడ యాదగిరి, ఓదెల లక్ష్మణమూర్తి, బత్తుల రాజు, రేవూరి రాజన్న, అంకతి రాజు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వానికి అప్పగించవచ్చు

న్యూశాయంపేట: పోషించే స్థితి లేనప్పుడు అప్పుడే పుట్టిన శిశువులను తల్లిదండ్రులు ప్రభుత్వానికి అప్పగించవచ్చని వరంగల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ చైర్మన్ మండల పరశురాములు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వానికి అప్పగించిన పిల్లలను పిల్లలు లేని దంపతులకు చట్టప్రకారం దత్తత ఇవ్వనున్నట్లు వివరించారు. భ్రూణ హత్యలకు పాల్పడడం, అప్పుడే పుట్టిన పిల్లలను వదిలించుకోవాలని చూడడం శోచనీయమని పేర్కొన్నారు. ఊరుగొండలో జరిగిన ఘటన బాధాకరమని ఆయన తెలిపారు.

పెళ్లి బరాత్‌లో యువకుల బాహాబాహీ

- లాఠీలకు పనిచెప్పిన పోలీస్‌లు



రోడ్డుపైన గొడవ పడుతున్న యువకులు

పరకాల : ఏం జరిగిందో తెలియదు ఒక్కసారిగా వంద మందికి పైగా యువకులు గొడవకు దిగడంతో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలోని వికాస్‌నగర్ కాలనీవాసులు భయభ్రాంతులకు గురి అయ్యారు. శనివారం రాత్రి ఓ వివాహం జరిగిన అనంతరం డీజే సాంగ్స్‌తో యువకులు సందడి చేశారు. కొద్ది సేపటికే కొందరు యువకుల మధ్య గొడవ జరిగిన క్షణాల్లోనే వంద మందికి పైగా అక్కడికి చేరుకున్నారు. దింతో గొడవ ఒక్కసారిగా ముదిరిపోయింది. దీంతో హనుమకొండకు వెళ్లే ప్రధాన రహదారిపై గుంపులుగా చేరుకొని బాహాబాహీకి దిగారు. స్థానికులు పోలీస్‌లకు సమాచారం అందించడంతో పోలీసు వాహనాన్ని గమనించిన యువకులు పరుగులు పెట్టారు. కొందరు యువకులను అదుపులోకి తీసుకున్న పోలీస్‌లు లాఠీలకు పనిచెప్పారు. డీజే సాంగ్స్‌తో ఈ గొడవ జరిగినట్లు తెలిసింది. ఇందులో ఓయువకుడి తలకు, మరో యువకుడి చేయికి గాయమైనట్లు సమాచారం.

కడియంతోనే నియోజకవర్గ అభివృద్ధి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేలేరు : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసిందే ఎమ్మెల్యే కడియం శ్రీహరి అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి సంపత్, మండల ఇన్‌చార్జ్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రెండురోజుల క్రితం కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు స్థాయిని మరిచి ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై విమర్శలు చేయడం హేయమైన చర్య అన్నారు. కడియం శ్రీహరి మంత్రిగా, ఎమ్మెల్యేగా పనిచేసి వేలేరు మండలంలో గురుకుల పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బీటీ రోడ్లు, ప్రభుత్వ పాఠశాల భవనాల నిర్మాణానికి నిధులు తీసుకువచ్చారని అన్నారు. మండలంలో డబుల్ రోడ్డుకు కేంద్రం నిధులు కేటాయిస్తే తామే తీసుకువచ్చినట్లు చెప్పకోవడం బీఆర్‌ఎస్‌కే చెల్లుతుందని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య కడియం శ్రీహరిపై విమర్శలు చేయడం మానుకోవాలని, దళితబంధు పేరుతో వసూలు చేసిన కమీషన్లు బాధితులకు తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ సంపత్, మాజీ సర్పంచ్ మల్లికార్జున్, కుడా మాజీ డైరెక్టర్ యాదగిరి, సంపత్, లక్ష్మణ్ నాయక్, మధుసూదన్, సంపత్, గట్టయ్య పాల్గొన్నారు.

కారల్ మార్క్స్ ఆశయ సాధనకు పోరాటం

వరంగల్: కారల్ మార్క్స్ ఆశయాల కోసం పోరాడుదామని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. మార్క్స్ జయంతి సందర్భంగా వరంగల్ శివనగర్‌లో సీపీఐ తమ్మెర భవనంలో సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మార్క్స్ ఆశయ సాధనమైన దోపిడీ రహిత సమాజం కోసం పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, వీరగోని శంకరయ్య, జన్ను రవి, ఎలేందర్, యాకూబ్, యాకాంబ్రచారి, వెంకటాద్రి, పాషా, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

న్యూశాయంపేట: కారల్ మార్క్స్ ఆశయాలను సాధించేవరకూ పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. మార్క్స్ 206వ జయంతి సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లేశ్, సారంగపాణి, రాజు, రవి, రాజకుమార్, రమేష్, అనిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్ సీపీఎం కార్యాలయంలో..

హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చుక్కయ్య, సాంబయ్య, రవి, రాజు, భాగ్యలక్ష్మి, రాజేష్, వెంకన్న, చందులాల్, స్వరూప, గొడుగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

హసన్‌పర్తి: నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో ఎన్‌సీసీ సహకారంతో శరత్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ ఏవీవీ.సుధాకర్, డాక్టర్ పీ.మూర్తి, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవీందర్ పాల్గొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

వరంగల్ : గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ పరిధిలోని ఆరెపల్లి శివారులో ఉన్న ప్రతిమ ఆస్పత్రి వెనుక ఆదివారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభించిందని ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించగా సుమారు 65–70 సంవత్సరాల వయస్సు గల మహిళ శవం ఉందన్నారు. ఆమె గులాబీరంగు చీర, నీలిరంగు జాకెట్ ధరించి ఉందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఏనుమాముల సీఐ (87126 85120), ఎస్సై (87126 85288)కి సమాచారం అందించాలని కోరారు.

అబద్ధాల హామీలతో కాంగ్రెస్ ప్రచారం

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న ధర్మారెడ్డి

ఆత్మకూరు : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అబద్ధాల హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తుందని, అసెంబ్లీ ఎన్నికల్లో అరచేతిలో వైకుంఠం చూపి, మోసం చేసి గెలిచిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని అగ్రంపహాడ్, నాగయ్యపల్లి, అక్కంపేట, లింగమడుగుపల్లి, పెద్దాపూర్, కామారం గ్రామాలలో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధాలు, సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సైతం కాంగ్రెస్ పార్టీ అదే బాట పట్టిందన్నారు. ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని అన్నారు. రూ.4 వేల పింఛన్ రాలేదని, ఆడపిల్లల వివాహాలకు తులం బంగారం ఇవ్వలేదని, కరెంటు కోతలు పెరిగాయన్నారు. మోసపోతే గోసపడతామని కేసీఆర్ ముందే హెచ్చరించారని, అయినా ప్రజలు వినకుండా మోసపోయారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గాలి మాటలు చెప్పి మోసగించే వారి మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, నాయకులు బొల్లోజు కుమారస్వామి, బొల్లెబోయిన రవియాదవ్, కాంతాల కేశవరెడ్డి, సావురే రాజేశ్వర్ రావు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న వాకర్స్

కేయూ క్యాంపస్: రక్తదానం చేయడమంటే మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య అన్నారు. కాకతీయ యూనివర్సిటీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని క్రీడా మైదానంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, కేయూ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, వీరస్వామి బాధ్యులు మొగిలయ్య, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ కిషన్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

శాయంపేట : పెద్దపూర్–వరంగల్ రూటు బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని దళిత సంఘం నాయకుడు మారెపల్లి సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వరంగల్‌కు వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రైవేటు వాహనాల్లో వెళ్లేందుకు ప్రజలకు ప్రయాణ ఖర్చులు అధికమవుతున్నాయని, వెంటనే పెద్దాపూర్–వరంగల్ బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరారు.

ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

హన్మకొండ: యువతను మహోన్నతులుగా తీర్చిదిద్దడమే రామకృష్ణ సేవా సమితి లక్ష్యమని ఆ సమితి హనుమకొండ అధ్యక్షుడు కటంగూరి సత్యనారాయణ రెడ్డి అన్నారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ కేఎల్‌ఎన్ రెడ్డి కాలనీలో నిర్వహిస్తున్న బాల సంస్కార్ వేసవి శిక్షణ శిబిరంలో ఆయన ఆదివారం పాల్గొని మాట్లాడారు. సమితి నిర్వహిస్తున్న కార్యక్రమాలు తమ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షిస్తాయని అన్నారు. మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ బండారి జగదీష్ మాట్లాడుతూ టీనేజ్ పిల్లల్లో వచ్చే మానసిక, శారీరక మార్పులను తల్లిదండ్రులు గుర్తించి, వారి అభిప్రాయాలను గౌరవించాలన్నారు. పిల్లలను మంచి నడవడికతో పెంచాలని సూచించారు. చదువులో ముందుండే విధంగా చూడాలని అన్నారు. రామకృష్ణ సేవాసమితి హనుమకొండ ప్రధాన కార్యదర్శి జినుగు విష్ణువర్ధన్ రెడ్డి, కోశాధికారి కేవీ.రావు, బాల సంస్కార్ కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ రామకృష్ణ, స్వరూప, రాధిక, సేవా సమితి సభ్యులు తిరుపతిరెడ్డి, కేదారి, అశోక్ రెడ్డి, అంజనీదేవి, లక్ష్మీదేవి, పార్వతి, సరోజ, అనిత, శిల్ప, వలంటీర్లు వీణ, విష్ణు, పరశురాములు, శ్రీకర్ పాల్గొన్నారు.

సంక్షేమానికి పాటుపడే వారినే ఎన్నుకోవాలి

హన్మకొండ: వినియోగదారుల సంక్షేమానికి పాడుపడే వ్యక్తికి ఓటు వేసి ఎన్నుకోవాలని కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ అన్నారు. హనుమకొండలోని ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ కార్యాలయంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు త్రిపురోజు రవికుమార్ అధ్యక్షతన ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ రాష్ట్ర ప్రతినిధుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో సుదర్శన్ మాట్లాడుతూ.. వినియోగదారుల రక్షణ చట్టం 1986, 2019ని అనుసరించి తామందరం పొందిన ఆరు హక్కుల్లో 'బాధ్యతాయుతంగా ఎంపిక చేసుకునే హక్కు' ముఖ్యమైనదని వివరించారు. రవికుమార్ మాట్లాడుతూ.. సభ్యులందరికి ఓటరు చైతన్య కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ప్రతినిధులు నరహరి, కిరణ్ కుమార్, వెంకటేశ్వర్ రావు, వెంకటరమణ, రవి, ప్రకాష్, ప్రవీణ్ కుమార్, సాయినాథ్, రమేష్ బాబు, రజాక్, శ్రీనివాస్ గౌడ్, మహేందర్, మోహన్ రావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.